## ఆదర్శవంతమైన నగరంగా వరంగల్‌ను తీర్చిదిద్దడమే లక్ష్యం





# ప్రజాపక్షం
# జిల్లా అనుబంధం

హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

శనివారం | 11 జులై, 2026 | పేజీలు :06


## డిజిటలైజ్ ప్రక్రియ వేగవంతం



కలెక్టర్ రాహుల్ శర్మ

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న డిజిటలైజ్ ప్రక్రియ వేగవంతం చేయాలని భారత ఎన్నికల సంఘం డిప్యూటీ ఎన్నికల కమిషనర్ పవన్ కుమార్ శర్మ తెలిపారు. శుక్రవారం న్యూ ఢిల్లీ నుండి కార్యదర్శి నవీన్ కుమార్ తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ఎలాంటి పొరపాట్లు లేకుండా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మ్యాపింగ్ చేసిన డాటా ఆధారంగా ఎన్యుమరేషన్ ఫారాలను సరిచూసుకొని డిజిటైజేషన్ ప్రక్రియను వేగవంతం చేస్తామని తెలిపారు. నియోజకవర్గంలో 99.52 శాతం ఎన్యూమ రేషన్ ఫారాలు పంపిణీ పూర్తి అయిందని, డిజిటలైజేషన్ 37.36 శాతం జరిగినట్లు తెలిపారు. ఈ నెల 24 వరకు పారదర్శకంగా డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేసేందుకు సహాయకులను నియమిస్తామని తెలిపారు. అలాగే మండల ప్రత్యేక అధికారులు తహసీల్దార్లు పర్యవేక్షణ చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ వీడియో సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డిఆర్వో వసంత కుమారి, ఆర్డీఓ హరికృష్ణ, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు విజయలక్ష్మి , అబ్బాస్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## వేగవంతంగా ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ

ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌ను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలి

భారత ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ పవన్ కుమార్ శర్మ




**ప్రజాపక్షం/హనుమకొండ :** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని అత్యంత పకడ్బందీగా నిర్వహించి, ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసి నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని భారత ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ డాక్టర్ పవన్ కుమార్ శర్మ ఎన్నికల అధికారులను ఆదేశించారు.శుక్రవారం న్యూఢిల్లీ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డితో కలిసి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి హన్మకొండ జిల్లా నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ చాహాత్ బాజ్ పాయి జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పాల్గొన్నారు.ఈ సందర్భంగా డా. పవన్ కుమార్ శర్మ మాట్లాడుతూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి ఈ నెల 24వ తేదీ లోగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తి చేయాలని సూచించారు. అలాగే పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణలో భాగంగా ఏ పోలింగ్ కేంద్రంలోనూ 1,200 మందికి మించి ఓటర్లు లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.తెలంగాణ రాష్ట్రంలో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ 99.06 శాతం, డిజిటలైజేషన్ 33.31 శాతం పూర్తయిందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి వివరించారు.ప్రతి బీఎల్ఓ రోజుకు కనీసం 15 శాతం డిజిటలైజేషన్ లక్ష్యాన్ని చేరుకోవాలని, ప్రతి బీఎల్ఓకు ముగ్గురు వాలంటీర్లతో బృందాలను ఏర్పాటు చేసి ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రవి, డిఆర్ ఓ శ్రీనివాస్, ఎన్నికల సూపరింటెండెంట్ జగత్ సింగ్ సంబధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 40 క్వింటాల్ రేషన్ బియ్యం పట్టివేత



**ప్రజాపక్షం/కమలాపూర్:** కమలాపూర్ మండలంలోని అంబాల గ్రామానికి చెందిన కెత్త విజేందర్ ఇంటి వెనకాల ఉన్న షెడ్డులో రేషన్ బియ్యాన్ని నిల్వ చేసి ఉంచినట్లు వచ్చిన సమాచారం మేరకు కమలాపూర్ ఎస్ఐ అనంతగిరి మధు, టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్ళి చూడగా 40 క్వింటాల రేషన్ బియ్యాన్ని నిల్వ చేసి ఉంచడంతో సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అట్టి బియ్యం విలువ రూ.లక్ష 20 వేలు ఉంటుందని తెలిపారు. ఎస్ఐ మధు మాట్లాడుతూ... రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించినా, నిలు వ చేసిన, అక్రమ వ్యాపారాలకు పాల్పడిన ప్రతి వ్యక్తి పై చట్టపరమైన చర్యలు తీసుకోవడం తప్పదని హెచ్చరించారు. ఎవరైనా అక్రమ దందా చేసినట్లయితే పోలీసులకు సమాచారం అం దించాలని ప్రజలను విజ్ఞప్తి చేశారు. టాస్క్ ఫోర్స్ సిబ్బందితో పాటు కమలాపూర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పిహెచ్‌సిని సందర్శించిన కలెక్టర్



**ప్రజాపక్షం/కొండపాక :** ప్రభుత్వం ఆసుపత్రులలో సమయ వేళలు పాటించని డాక్టర్లు , ఇతర సిబ్బందిపై తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హైమావతి కె. హైమావతి జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. శుక్రవారం ఉదయం కొండపాక మండల కేంద్రం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి రోగులకు అందించే వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కి ఉదయం 9:58 నిమిషాలకు అటెండర్ తప్ప మెడికల్ ఆఫీసర్ నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు గైర్హాజరపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో సమయ వేళలు పాటించని వైద్యులు కింది స్థాయి సిబ్బంది అందరిపైన కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారికి ఫోన్ ద్వారా ఆదేశించారు. గ్రామీణ నిరుపేదలకు ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్యం చేయడం కోసం ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పించిందని, ప్రతి ఒక్కరు ఓపికగా, రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం చేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు

## మోడల్ హాస్టల్ ఆవరణలో పిచ్చి మొక్కలు

అందుబాటులో లేని వార్డెన్

హాస్టల్‌లో నైట్ వాచ్‌మెన్ లేరు

భయాందోళనకు గురవుతున్న విద్యార్థులు



**ప్రజాపక్షం/రేగోడ్:**మెదక్ జిల్లాలో రేగోడ్ మోడల్ హాస్టల్‌లో ఆవరణలో పాము తిరగడంతో కలకలం రేపింది. రేగోడ్ మోడల్ హాస్టల్ ఆవరణలో పిచ్చి మొక్కలు పెరిగడంతో అట వీ ప్రాంతంగా మారింది. భవనం కిటికీలు, జాలిలు బిగించలేదు. కరెంటు పోతే అంధాకారంగా మారుతుంది. బ్యాటరీ ఏర్పాటు చేయలేదని విద్యార్థుల తల్లిండ్రులు తెలిపారు. హాస్టల్ కు నైట్ వాచ్‌మెన్ లేరని సిబ్బంది కూడా ఉండడం లేదని అన్నారు. హాస్టల్ వార్డెన్ ఫోన్లో వివరణ కోరగా హాస్టల్ ఈ రోజు తినడానికి బియ్యం తేవడానికి వెళ్లానని అన్నారు. ఆవరణలో పాము వచ్చింది నిజమేనని హాస్టల్ చుట్టు పక్కల చెట్ల కొమ్మలు పెరిగిపోయాయని మండల అధికారులకు చెట్ల కొమ్మలు తొలగించాలని సమాచరం ఇచ్చినట్లు తెలిపారు.

# ప్రభుత్వ భూములను కాపాడాలని ఇనుగాలను కలిసిన గ్రామస్తులు

**ప్రజాపక్షం/హసన్ పర్తి :** హనుమకొండ జిల్లా 65వ డివిజన్ పరిధిలోని ఎల్లాపూర్ గ్రామానికి చెందిన గ్రామస్తులు ప్రభుత్వ భూములను కాపాడాలని కోరుతూ హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్ రామ్ రెడ్డిని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు.గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం, ఎల్లాపూర్ గ్రామ సర్వే నంబర్ 246లో చకిలం రాజలింగం అనే వ్యక్తి 1954–55 సంవత్సరంలో వ్యాసరాజు సంజీవరావు నుంచి 12 ఎకరాల 13 గుంటల భూమిని కొనుగోలు చేసినట్లు ఆర్‌టిఐ ద్వారా రెవెన్యూ అధికారులు సమాచారం ఇచ్చారని తెలిపారు. అందులో 2 ఎకరాల 16 గుంటల భూమి చేపల ఉత్పత్తి కేంద్రానికి సంబంధించిన ప్రభుత్వ భూమిగా ఉందని పేర్కొన్నారు.ఈ భూమిలో 1973లో అప్పటి కేంద్ర మంత్రి సి. సుబ్రహ్మణ్యం చేపల ఉత్పత్తి



కేంద్రంతో పాటు ఇందిరా కాలనీని ప్రారంభించారని, దీనికి సంబంధించిన శిలాఫలకాలు, గోదాం, గెస్ట్ హౌస్ (బంగ్లా), చేపల పెంపకానికి నీటి బావి తదితర నిర్మాణాలు ఇప్పటికీ ఉన్నాయని గ్రామస్తులు తెలిపారు.అయితే, హసన్‌పర్తి ఎమ్మార్వో మత్స్యశాఖ అధికారులను నివేదిక కోరగా, హనుమకొండ మత్స్యశాఖ అధికారులు అక్కడ చేపల ఉత్పత్తి కేంద్రానికి సంబంధించిన ఎలాంటి కట్టడాలు లేవని నివేదించారని గ్రామస్తులు ఆరోపించారు. ఆర్‌టిఐ ద్వారా సేకరించిన సమాచారంలో మాత్రం నిర్మాణాలు ఉన్నట్లు స్పష్టమైన ఆధారాలు లభించాయని పేర్కొన్నారు.ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన అధికారులు తమ బాధ్యతను విస్మరించి వాస్తవాలను దాచిపెడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్య క్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రభు త్వ భూములను కాపాడడంతో పాటు ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షు డు ఇనుగాల వెంకట్ రామ్ రెడ్డి ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో 65వ డివిజన్ అధ్యక్షుడు నేదునూరి సునీల్, రేణుకుంట్ల దుర్గాప్రసాద్ మా దిగ, మోతె లింగారెడ్డి, వెలిసోజు బుచ్చి రాములు, గం గిళ్ల వెంకట్ రెడ్డి, ఎర్ర నాగరాజు పాల్గొన్నా రు.

# కెయు మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో క్లీన్ అండ్ గ్రీన్

**ప్రజాపక్షం/కెయు క్యాంపస్ :** కాకతీయ విశ్వవిద్యాలయం మహిళ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం కళాశాల పరిసర ప్రాంతాల్లోని పిచ్చి మొక్కలను తొలగించి చెత్త చెదారం ఏమి లేకుండా అధ్యాపకులు విద్యార్థులు బోధనేతర సిబ్బంది కలిసి కళాశాల చుట్టూ క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని చేపట్టారు అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె భిక్షాలు మాట్లాడుతూ కళాశాల చుట్టూ పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటామని, కళాశాలలో ఎప్పుడు పూల మొక్కలతో పచ్చని పరిసరాలతో కలకలలాడుతూ ఉండేలా ప్రతి ఒక్కరు పాటుపడాలని అన్నారు. విద్యార్థులు విద్యతోపాటు పర్యావరణ పరిరక్షణపై దృష్టి సాధించాలని ఎన్విరాన్మెంట్ బాగా ఉన్నప్పుడే మానసికంగా మనం సంతోషంగా ఉంటామని అన్నారు ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బోధనెత్తర సిబ్బంది విద్యార్థులు పలువురు పాల్గొన్నారు.

# ఎన్యుమరేషన్ ఫామ్‌పై ఫోటో వద్దు

**ప్రజాపక్షం/నడికూడ:**(ఎస్ఐఆర్)లో భాగంగా ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఈనెల 15వ తేదీ లోపు ఎన్యుమరేషన్ ఫామ్ లను నడికూడ మండలంలోని గ్రామాల ప్రజలు నింపి బిఎల్వోలకు అందజేస్తే ఆన్లైన్ చేయడం జరుగుతుందని ఫామ్ పై ఫోటో కోసం ప్రజలు ఇబ్బందులు పడ వద్దు అని ఎన్యుమరేషన్ ఫామ్ పై ఫోటో అవసరం లేదని నడికూడ మండల తహసిల్దార్ రాణి తెలిపారు.వారు మాట్లాడుతూ ఫామ్ పై తప్పనిసరి తల్లిదండ్రుల పేర్లు లేకుండా ఆన్లైన్ తీసుకోదని ఫామ్ పై తల్లి దండ్రుల పేరు,ఆధార్ కార్డు నెంబర్ ఇవి ముఖ్యమైనవి అని ఫామ్ నింప లేనివారు మీ గ్రామాల్లో బిఎల్వోలు డ్యూటీ చేస్తున్నారు కావున బిఎల్ఓ లను సంప్రదించి వివరాలను తెలుపుతూ ఫామ్ ను నింపేలా చూసుకోవాలని,ఫామ్ నింపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలను కోరుతున్నానని మండలంలోని గ్రామాల ప్రజలు తొందరగా ఎన్యుమరేషన్ ఫామ్ లను నింపి బిఎల్ఓలకు అందజేయాలని కోరుతున్నానని తహసిల్దార్ రాణి తెలిపారు.ఈ కార్యక్రమంలో జిపిఓ మౌనిక,బిఎల్వో లు అనిత,సంపూర్ణ,కళావతి,ప్రజలు పాల్గొన్నారు.

# విద్యుత్ ప్రైవేటీకరణ విధానాలను వ్యతిరేకిద్దాం

## హనుమకొండ ఎస్ ఇ ఆఫీసు ముందు ధర్నా

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని, ఆ బిల్లుకు మద్దతుగా రాష్ట్రంలో విద్యుత్తు ప్రైవేటీకరణకు వేగవంతం చేయడం కోసం రాష్ట్రంలో రైతు డిస్కాంను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకు వస్తున్నాడని దాన్ని వెనక్కి తీసుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సారంపల్లి వాసుదేవరెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం చుక్కయ్య డిమాండ్ చేశారు.. విద్యుత్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ హనుమకొండ నక్కలగుట్టలోని సూపరిఇండెంట్ ఇంజనీర్ కార్యాలయం ముందు శుక్రవారం సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేశారు ధర్నా అనంతరం ఎస్ ఈ నాయక్ కు వినతి పత్రం అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా వ్యవసా కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గుమ్మడి రాజుల రాములు అధ్యక్షతన ధర్నా జరిగింది.ఈ ధర్నాలో రాగుల రమేష్ , సారంపల్లి వాసుదేవరెడ్డి, ఎం. చుక్కయ్య లు మాట్లాడుతూ రాష్ట్రంలో రైతు డిస్కాం ను వెనక్కి తీసుకోవాలని, కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని,విద్యుత్ ప్రవేటీకరణ విధానాలను, ప్రతిఘటించాలని వారు పిలుపునిచ్చారు. నాణ్యమైన విద్యుత్ పేరుతో వినియోగదారులను రైతులను కరెంటు నుండి దూరం చేయడంలో భాగమే ఈ ప్రైవేటీకరణ విధానాలని సవరణల పేరుతో రైతుల మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించే కుట్ర దాగి ఉందని ఇప్పుడు ఇస్తున్న సబ్సిడీలు మొత్తం కూడా పేదలకు దూరమవుతాయని కరెంటు చార్జీలు పెరుగుతాయని కేంద్రం తీసుకువచ్చిన సవరణల వెనక కుట్ర దాగి ఉందని ఉమ్మడి జాబితాలోని కరెంటును కేంద్రం తన చెప్పు చేతుల్లో పెట్టుకోవడం కోసం విద్యుత్ ప్రవేటీకరణ బిల్లును తీసుకొచ్చిందని తీవ్రంగా మండిపడ్డారు.ఈ కార్యక్రమంలో సిఐటియు,వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు టి ఉప్పలయ్య, బొట్ల చక్రపాణి, పుల్ల అశోక్ మంద సుచెందర్, ఓరుగంటి సాంబయ్య, కారు ఉపేందర్, స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

# తూకానికి కాదు... గ్రంథాలయాలకు, అవసరార్థులకు పుస్తకాలు అందిద్దాం

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ఇంట్లో ఉపయోగం లేకుండా ఉన్న పుస్తకాలను తూకానికి అమ్మకుండా, అవసరమైన గ్రంథాలయాలు, విద్యార్థులకు అందించి విజ్ఞానాన్ని పంచాలని ప్రముఖ సామ్యాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ పిల్లుపునిచ్చారు.తాను ప్రారంభించిన ఐ లవ్ రీడింగ్ ఐ లైక్ లైబ్రరీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం హనుమకొండలోని పి.ఎం.ఎస్.హెచ్.ఆర్.ఐ. ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హైస్కూల్ గ్రంథాలయానికి అవసరమైన కొన్ని పుస్తకాలను పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు వెంకట్రాం రెడ్డికి అందజేశారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఒక మంచి పుస్తకం అనేక మంది విద్యార్థులకు మార్గదర్శకంగా నిలుస్తుందని, ఇంట్లో నిరుపయోగంగా ఉండే పుస్తకాలు లేదా తూకానికి వెళ్లే పుస్తకాలు గ్రంథాలయాలకు చేరితే మరెందరో విద్యార్థుల విజ్ఞానాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ఈ ఆలోచనతోనే ఐ లవ్ రీడింగ్... ఐ లైక్ లైబ్రరీ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు.ప్రజలు తమ వద్ద ఉన్న ఉపయోగకరమైన పుస్తకాలను తూకానికి విక్రయించకుండా అవసరమైన గ్రంథాలయాలకు విరాళంగా అందించాలని ఆయన కోరారు. పుస్తకాలు విరాళంగా ఇవ్వదలచిన వారు 99497 09866 నంబర్‌ను సంప్రదిస్తే, అవసరమున్న గ్రంథాలయాలకు చేరవేసేలా సమన్వయం చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు నరేందర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, రోజారాణి, పద్మ, కమల పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ

**ప్రజాపక్షం/హసన్ పర్తి :** నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ (ఎన్ఎంఫ్ )పథకం కింద మడిపల్లి రైతు వేదికలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది.హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం మడిపల్లి గ్రామరైతు వేదికలో జయగిరి,లక్నవరం, మడిపల్లి రెవెన్యూ గ్రామరైతు లకు ప్రకృతి వ్యవసాయం చేసే పద్ధతులు, సూత్రాలు, విధానాలు, సేంద్రీయ ఎరువులు సేంద్రీయ పురుగుమందుల తయారీ, వాటి వినియోగ విధానాలపై రైతులకు సమగ్ర అవగాహన కల్పించారు.ఈ శిక్షణకు ప్రకృతి వ్యవసాయంలో 15 సంవత్సరాల అనుభవం కలిగిన రిసోర్స్ పర్సన్ కె.రఘు శిక్షణ అందించారు. ఆయన ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలు,వ్యయనియంత్రణ, నేల ఆరోగ్య పరిరక్షణ నాణ్యమైన దిగుబడులసాధనపై రైతులకు వివరించారు. అలగే తను స్వయంగా తయారు చేసిన నీమస్త్రం, బ్రహ్మాస్త్రం, పంచగవ్య వావిలాకు కషాయం, అగ్ని అస్త్రం,వేస్ట్ డికంపోజర్, దశపర్తి కషాయం తీసుకొని వచ్చి వాటి తయారీ విధానం వాటి వల్ల కలిగే లాభాలు గురించి వివరించారు.ఈ పథకం కింద 125 మంది రైతులు ఎంపిక కాగా అందులో 50 మంది రైతులకు శిక్షణ అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అడ్లూరి అనురాధ, వ్యవసాయ విస్తరణ అధికారి (ఎ ఇ ఓ) సుమన్, జయగిరి సిఅర్ పిసి ఆర్ పి రమ్య, మడిపల్లి సిఆర్ పి రవళి,జైగిరిగ్రామరైతులు ,గ్రీకురు గట్టుస్వామి,బొజ్జ రాజ్ కుమార్, రేణుకుంట్ల మోహన్, కదిపికొండ తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డిఎంహెచ్ఒగా విధుల్లో చేరిన డాక్టర్ అప్పయ్య



**ప్రజాపక్షం/హనుమకొండ :** హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా డాక్టర్ ఏ.అప్పయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల సాధారణ బదిలీలలో భాగంగా ములుగు ప్రభుత్వ ఆసుపత్రి ఆర్ఎం ఓ గా జాయిన్ అయిన ఆయనను హనుమకొండ డిఎంహెచ్ఓ గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్‌ని, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డిని డాక్టర్ ఏ. అప్పయ్య మర్యాదపూర్వకంగా కలిశారు.జిల్లా ప్రజలకు మెరుగైనవైద్య సేవలు అందించాలని వారు సూచించారు.

# పెండింగ్ డిఎలు,పిఆర్సి వెంటనే ప్రకటించాలి

## టిఎస్ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు



**ప్రజాపక్షం /నడికూడ :** రాష్ట్ర ప్రభుత్వం వెంటనే గత మూడు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న డిఎలు పిఆర్ సిని వెంటనే ప్రకటించాలని టిఎస్ యుటిఎఫ్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు డిమాండ్ చేశారు.నడికూడ మండలంలోని వివిధ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వరికోలు ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ 2023 జూలై 1 నుంచి అమలు కావాల్సిన పిఆర్సి 36 నెలలు గడిచినప్పటికీ నేటికీ కూడా కనీసం నివేదికను కూడా బహిర్గతం చేయలేదని వెంటనే పిఆర్సి నివేదికను బహిర్గతపరిచి వెంటనే అమలు చేయాలని పిఆర్సి ఆలస్యం వల్ల ఇప్పటికే ఉద్యోగులు,ఉపాధ్యాయులు ఒక పిఆర్‌సిని నష్టపోయారని ఆరు నెలలకు ఒక సారి చెల్లించాల్సిన కరువుభత్యాన్ని ప్రకటించలేదని వెంటనే డిఏలు ప్రకటించాలని డిమాండ్ చేశారు.సర్వీస్ రూల్స్ సమస్య పరిష్కారం చేసి డైట్ లెక్చరర్,డిప్యూటీ డిఇఒ,డిఇఒ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని పాఠశాలలను కుదించాలనే ఆలోచన మానుకొని ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు.కేజీబీవీ,మోడల్ స్కూల్,గురుకుల,ఎయిడెడ్ పాఠశాలల ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు వర్తింపజేయాలని,మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010వేతనాలు అమలు చేయాలని కెజిబివిలలో పని చేసే సిబ్బందికి మినిమం టైం స్కేల్ ఇవ్వాలని తెలిపారు.ఈ సభ్యత నమోదు కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి మెరుగు ప్రసన్న ఆనంద్,టిఎస్ యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్షులు రవీందర్,టీఎస్ యుటిఎఫ్ జిల్లా నాయకులు పల్లె శ్రీనివాస్, దేవా,రవికుమార్,రమేష్ పాల్గొన్నారు.

# 12న ఇండియన్ బ్యూటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫ్యాషన్ షో

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :**ఇండియన్ బ్యూటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 12న ఫ్యాషన్ షో నిర్వహిస్తున్నట్లు ఇండియన్ బ్యూటీ అసోసియేషన్ నిర్వాహకులు వడ్డీ లలితా రావు, హసీనా సంయుక్తంగా తెలిపారు. శుక్రవారం హనుమకొండ గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో లలితారావు ,హసీనా మాట్లాడుతూ అంబేద్కర్ భవన్ లో ఈనెల 12న కాజీపేట, హనుమకొండ, వరంగల్ ప్రాంతాల వారి కోసం ఫ్యాషన్ షో నిర్వహిస్తున్నామని, ఈ ఫ్యాషన్ షో లో వివిధ కేటగిరీలలో పురుషులు, స్త్రీలు , గృహిణులు, చిన్నపిల్లలు, వయోవృద్ధులు పాల్గొనవచ్చు అన్నారు. ఈ పోటీలో పాల్గొనుటకు మోడల్స్ ఒక్కొక్కరికి ఎంట్రీ ఫీజు 999 రూపాయలు నిర్ణయించడం జరిగిందని, ట్రై సిటీలోని యువత, స్త్రీలు, పిల్లలు, వృద్ధులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు, యూట్యూబర్లు, మోడల్ రంగంలో నిష్ణాతులు పాల్గొంటున్నారని, ఈ అవకాశాన్ని మోడల్స్ వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ బ్యూటీ అసోసియేషన్ నిర్వాహకులు వనజ, రోషిని, సనాత బస్సుమ్,మహిత పాల్గొన్నారు.

# పిఎసిఎస్ చైర్మన్‌ను సన్మానించిన సిపిఐ,ఎఐటియుసి నాయకులు

**ప్రజాపక్షం/నెక్కొండ:** రెడ్లవాడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పిఏసిఎస్) చైర్మన్‌గా ఎన్నికైన ఆవుల శ్రీనివాస్‌ను సిపిఐ, ఏఐటియూసి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పనాల ప్రసాద్, ఎఐటియుసి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కందిక చెన్నకేశవులు, జిల్లా కార్యదర్శి గన్నారపు రమేష్‌లు మాట్లాడుతూ, సహకార సంఘం అభివృద్ధితో పాటు రైతులకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఇందుకు ఆవుల శ్రీనివాస్ కృషి చేయాలని అభినందనలు తెలిపారు.

# ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణలో డిజిటలైజ్ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలి

**ప్రజాపక్షం/జనగామ :** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న డిజిటలైజ్ ప్రక్రియ వేగవంతం చేయాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. శుక్రవారం డిల్లీ నుండి ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్‌కుమార్‌తోకలిసి భారత ఎన్నికల సంఘం డిప్యూటి కమీషనర్ పవన్‌కుమార్ శర్మ జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో సమీక్ష నిర్వయించారు. అనంతరం జనగామ జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో సమీక్ష నిర్వయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఎన్నికకు ముందు ఎన్నికల జాబితాను నవీకరించవలసిని బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు. 18 సంవత్సరాల వయసు నుండి అర్హత కలిగిన ప్రతి భారత పౌరుడు, అయా నియోజకవర్గంలో సాధారణ నివాసితులు,చట్టపరంగా అనర్హులు



కాని వారు ఓటరుగా నమోదు కావచ్చునన్నారు. ఇంటింటి సర్వేలు, బూత్ స్థాయి అధికారుల పనితీరు ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు, తొలగింపు సవరణ ప్రక్రియలను ఖచ్చితత్వంతో నిర్వయించాల్సి ఉందన్నారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా మిగిలిన ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని, ఈ నెల 24 నాటికి డిజిటలైజ్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. సాంకేతిక పరిజ్ఞాన్ని సమర్థవంతంగాఈ వినియోగిస్తూ నిర్ణీత కాల వ్యవధిలో ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఏ ఒక్క అర్హులైన పౌరుడు ఓటు హక్కు కోల్పోకుండా, అనర్హులు జాబితాలోకి చేరకుండా చూడాలన్నారు. ఎన్యూమరేషన్ ఫారమ్ అందజేసిన ఓటర్లందరిని ముసాయిదా జాబితాలో చేర్చండ జరుగుతుందని, విచారణ లేకుండా ఏ ఓటరు పేరును జాబితా నుండి తొలగించకూడదన్నారు. దరఖాస్తుదారులను తగిన విచారణ ద్వారా వారి అనర్హతను ధృవీకరించిన అనంతరం తుది నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు. తుది జాబితా ప్రచురణ తర్వాత ఎవరైనా అసంతృప్తిగా ఉంటే జిల్లా మెజిస్ట్రేట్‌కు అప్పీల్ చే సుకునే అవకాశం ఉంటుందన్నారు. ఫారాల పంపిణీ పూర్తి అయినట్లుగానే డిజిటలైజేషన్ పూర్తి కావాలన్నారు.

# స్పోర్ట్స్ నాలెడ్జ్ ఆన్ వీల్స్ శిక్షణ కార్యక్రమం

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో, జిల్లా కలెక్టర్ అనుమతి తో మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పోర్ట్స్ నాలెడ్జ్ ఆన్ వీల్స్ మొబైల్ శిక్షణ కార్యక్రమం ఈ నెల 11న మధ్యాహ్నం 3:00 గంటలకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని కృష్ణ కాలనీలోని డా॥ బి.ఆర్. అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి సిహెచ్ రఘు తెలిపారు. గ్రామీణ, పట్టణ స్థాయిల్లో క్రీడలను మరింత ప్రోత్సహించడానికి, క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి సరికొత్త శిక్షణా విధానాలపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యమన్నారు. రాష్ట్ర స్థాయి నుండి నామినేట్ చేయబడిన ప్రత్యేక ఇంచార్జ్ కోచ్‌లు, ప్రముఖ ఫి జియోథెరపిస్ట్ ఈ శిక్షణలో పాల్గొని సరికొత్త క్రీడా నైపుణ్యాలు, ఆధునిక శిక్షణా పద్ధతులు, ఫిట్‌నెస్ సూత్రాల పై అవగాహన కల్పిస్తారని వివరించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేర కు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, జిల్లా పరిష త్, ప్రైవే ట్ పాఠశాలల, కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు, ఫి జికల్ ఎ డ్యుకేషన్ టీచర్లు ఈ శిక్షణా కార్యక్రమానికి త ప్పనిసరి గా హాజరుకావాలని స్పష్టం చేశారు. పీఈటీలకు ఆరోజును ఆన్ డ్యూటీ గా పరిగణి ంచడం జరుగుతుందని తెలిపారు. ఈ శిక్షణలో పీడీలు, పీఈటీలతో పాటు వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, క్రీడాకారులు, వ్యాయామ విద్యార్థులు అత్యధిక సం ఖ్య లో పాల్గొని, ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరా రు.

# ఓటర్లపై భారం వేస్తున్న బిఎల్‌ఓలు..!

**ప్రజాపక్షం/వేలేరు :** వేలేరు మండలంలో కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక కార్యక్రమంతో లబ్ధిదారులు తీవ్ర అయోమయానికి గురవుతున్నారు,ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్)ప్రక్రియలో చిక్కులు ఎదురవుతున్నాయి .క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెల్లిన బూత్ స్థాయి అధికారులు మండలంలోని వివిధ గ్రామాలలో ఇంటింటికి తిరిగి ఎన్యమరేషన్ ఫారాలు పంపిణీ చేస్తుండగా ఆఓటరు జాబితా సవరణ ఫారాలు ఓటర్లే స్వయంగా నింపి ఇవ్వాలని బిఎల్ ఓలు సూచిస్తుండగా ఓటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదర్కొంటున్నారు.ఓటరు జాబితా ఫారాలు ఏవిధాంగా పూరించాలో తెలియక చదువురాని వారు ,వృద్దులు,అవగాహన లేని సామాన్య ప్రజలు తలలు పట్టుకుంటున్నారు.ఒకవేళ ఓటరు జాబితా సవరణలో ఏవైనా తప్పులు దొర్లితే ఎక్కడ తమ ఓటుహక్కు పోతుందోనని ఆందోళన చెందుతున్నారు.. ..బిఎల్‌ఓలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి......బిజెపి మండలఅధ్యక్షు డు కాట్రేవుల రాజుయాదవ్... మండలంలోని కొంతమంది




బిఎల్‌ఓలకు ఓటరు జాబితా సవరణ ఫారాలు పూరించే విధానంపై ఉన్నత అధికారులు ప్రత్యేక శిక్షణ ఇచ్చినప్పటికీ క్షేత్రస్థాయిలో కొందరు అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తున్నాయి నిరక్షరాస్యులకు, వృద్ధులకు సహాయ ం చేయకుండా ఓటరు జాబితా సవరణ ఫారాలు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని స్థానికులు మండిపడుతూ ఈఫారాలు ఎలా పూరించాలో తెలియక చదువుకున్న వారి చుట్టూ తిరుగుతూ బ్రతిమాడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని ఓటర్లు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి బిఎల్‌ఓలతో పాటు ఓటర్లకు కూడా ఎన్యుమరేషన్ ఫారాల పూరణపై గ్రామాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరుతూ బిఎల్‌ఓలు బాధ్యతాయుతంగా వ్యవహరించి ఓటరు సవరణ ఫారాలు పూరించాలని బిజెపి వేలేరు మండలఅధ్యక్షుడు కాట్రేవుల రాజుయాదవ్ కోరుతున్నారు.

# బూత్ స్థాయి నుంచి పార్టిని బలోపేతం చేయాలి

## గూడూరులో బీజేపి నాయకులు పిలుపు

**ప్రజాపక్షం/గూడూరు:**మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని గుండెంగ గ్రామంలో బీజేపి బూత్ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన బూత్ కార్యకర్తల సమావేశంలో పార్టీ బలోపేతం ఓటరు నమోదు ప్రక్రియపై నాయకలు దిశానిర్దేశం చేశారు. ఈసమావేశానికి మండల అధ్యక్షుడు ముఖ్యఅతిథిగా హాజరై కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. పార్టీ విజయానికి బూత్ స్థాయి వ్యవస్థే కీలకమని ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేస్తే రానున్న ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు సాధించవచ్చని అన్నారు. మానుకోట నియోజకవర్గంలో కాషాయ జెండా ఎగరేలా ప్రతి బూత్‌లో పార్టీని మరింత బలోపేతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ఎస్ఐఆర్ ప్రక్రాయను వేగవంతంగా పూర్తి చేమాల్సిన అవసరం ఉందన్నారు.అర్హులైన ప్రతి పౌరుడు ఓటు హక్కును వినియోగించుకునేలా బూత్ లెవల్ అధికారులు (బిఎల్‌ఓలు) సమర్ధవంతంగా పనిచేయాలని వారికి పార్టీ తరపున నియమించిన బూత్ లెవల్ ఏజెంట్లు (బిఎల్ఏలు) సహకారం అందిస్తున్నారన తెలిపారు.ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదుయ్యేలా అందరూ సమిష్టిగా కృషి చేయాలని కోరా రు. ఈకార్యక్రమంలో నాయకలు వాంకుడోత్ శ్రీనువాస్ బానోత్ అరవింద్ బాస్కర్ శ్రీధర్ శ్రీకాంత్ రాకేష్ తదితరులు పాల్గోన్నారు.

# పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

**ప్రజాపక్షం/పాలకుర్తి:** పేదల సొంతింటి కల నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని బ్లాక కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, గ్రామ సర్పంచ్ జిట్టబోయిన రమ్య ప్రశాంత్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సిరెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని బమ్మెర గ్రామానికి చెందిన మల్లమ్మ ఇందిరమ్మ ఇళ్లు గృహప్వేశ కార్యక్రమానికి హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సు రేష్, వార్డు మెంబర్ శిరీష, శ్రీనివాస్, నాయకు లు కొమురయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

# ఎస్ఎఫ్ఐ విద్యాసంస్థల బంద్ విజయవంతం

**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** విద్యారంగ సమస్యల పరిష్కార కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) పిలుపుమేరకు జఫర్‌గడ్ మండలంలో శుక్రవారం విద్యాసంస్థల బంద్ విజయవంతమైందని జిల్లా ఉపాధ్యక్షుడు యాకన్న రాథోడ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని 27వేల ప్రభుత్వ పాఠశాలలను 4 వేలకు కుదించే ఆలోచనను విరమించుకోవాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యాసంస్థలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను భర్తీ చేసి, మౌళిక సదుపాయాలు, హాస్టళ్లలో సౌకర్యాలు మెరుగుపరచాలని కోరారు. విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే సీఎం కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు చరణ్, తరుణ్, కిరణ్, హరీష్ పాల్గొన్నారు.

# చింతూరులో పెసా గ్రామసభ

**ప్రజాపక్షం/వాజేడు:** ములుగు జిల్లా వాజేడు మండలం చింతూరు గ్రామంలో శుక్రవారం సర్పంచ్ తెల్లం సుమాంజలి అధ్యక్షతన నిర్వహించిన పెసా గ్రామసభలో అంగన్వాడీ ఆయా, టీచర్ పోస్టులను ఎస్టీలకే కేటాయించాలని గ్రామస్థులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ప్రస్తుతం రెండు పోస్టులను ఎస్సీ కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ, దరఖాస్తుల ప్రక్రియను వెంటనే నిలిపివేసి ఎస్టీలకు మాత్రమే కేటాయించేలా కొత్త నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఐదో షెడ్యూల్, పెసా చట్టాల ప్రకారం తమ హక్కులను కాపాడాలని, అవసరమైతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని ఆదివాసీలు తెలిపారు. ఈ సమావేశంలో వాజేడు ఎస్ఐ జక్కుల సతీష్, పెద్ది జగపతి బాబు, పంచాయతీ కార్యదర్శి అశోక్, పెసా మొబిలైజర్ తుమ్మ రమేష్, మాజీ సర్పంచ్ బుల్లేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

# చేనేత సహకార సంఘం అధ్యక్షుడిగా మామిడాల రమేష్



**ప్రజాపక్షం/కమలాపూర్:** కమలాపూర్ మండలం గోపాల్‌పూర్ గ్రామ చేనేత సహకార సంఘం ఎన్నికలు ఏకగ్రీవం కావడం జరిగింది. ఏకగ్రీవ ఎన్నికలలో నూతన అధ్యక్షులుగా మామిడాల రమేష్, ఉపాధ్యక్షులుగా పేరాల వనకర్, కార్యదర్శిగా మాటేటి బిక్షపతి, కోశాధికారిగా మామిడాల అనిల్, డైరెక్టర్‌లుగా మామిడాల సత్యనారాయణ, మామిడాల రాములు, గాజ సమ్మయ్య, క్యాతం స్వరూప, బిట్ల సరోజన ఎన్నిక కావడం జరిగింది. నూతన అధ్యక్ష, కార్యకర్గం సభ్యులను డైరెక్టర్లను గ్రామ సర్పంచ్ మామిడాల కళ్యాణి అశోక్ చేనేత సంఘం సభ్యులు అభినందనలు తెలిపారు. వారికి నూతన అధ్యక్షులు, కార్యవర్గం సభ్యులు, డైరెక్టర్లు ధన్యవాదాలు తెలియజేస్తూ చేనేత సంఘం కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తానని నూతన అధ్యక్షులు మామిడాల రమేష్ అన్నారు.

# అనారోగ్యంతో మృతి చెందిన వీఆర్ఏ కొంరమ్మ

**ప్రజాపక్షం/నల్లబెల్లి :** గత నాలుగు దశాబ్ధాలుగా నిస్వర్థంగా రెవేన్యూ కార్యాలయంలో వీఆర్ఏగా సేవలు అందించి అనారోగ్యంతో వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రానికి చెందిన కీసరి కొంరమ్మ ( 80 ) శుక్రవారం మృతి చెందారు . నాలుబై ఏండ్లుగా నల్లబెల్లి గ్రామానికి వీఆర్ఏ గా వీధులు నిర్వహిస్తు ప్రజలకు రెవేన్యూ అధికారులకు మధ్య వర్తిగా వ్యవహరిస్తూ పలువురి అధికారులు మన్నలు పొందినారు . కొంరమ్మ మరణా వార్త విన్న రెవెన్యూ అధికారులు దిగ్బంది చెంది సంతాపం వ్యక్తం చేశారు . వీఆర్ఏ కొంరమ్మ మరణం నల్లబెల్లి గ్రామంలో విషాధాచాయలు అలుముకున్నాయి .

# నెక్కొండ యూనియన్ బ్యాంక్ కొత్త మేనేజర్‌గా గొల్లపల్లి రమేష్

**ప్రజాపక్షం/నెక్కొండ:** యూనియన్ బ్యాంక్ కొత్త నాయకత్వం లభించింది. ఇప్పటి వరకు శాఖ మేనేజర్‌గా విధులు నిర్వహించిన అధికారి బదిలీపై ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతికి వెళ్ళగా, మహబూబాబాద్ జిల్లా కేసముద్రం యూనియన్ బ్యాంక్ శాఖ నుండి బదిలీపై వచ్చిన గొల్లపల్లి రమేష్ శుక్రవారం నెక్కొండ శాఖ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శాఖ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం మాట్లాడిన కొత్త శాఖ మేనేజర్ గొల్లపల్లి రమేష్, ఖాతాదారులకు మరింత మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. రైతులు, స్వయం ఉపాధి వర్గాలు, మహిళా సంఘాలు, చిన్న వ్యాపారులు బ్యాంకు అందిస్తున్న రుణాలు, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే బ్యాంక్ నుండి రుణాలు పొందిన ప్రతి ఒక్కరూ వాయిదాలను సకాలంలో చెల్లించడం ద్వారా బ్యాంక్ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. రుణాలు సకాల చెల్లింపుతో మరింత మంది అర్హులకు కొత్త రుణాలు మంజూరు చేసే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. కొత్త మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టడంతో శాఖ సేవలు మరింత సమర్థవంతంగా అందుతాయని ఖాతాదారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# సహకార సంఘం కార్యవర్గం ఎన్నిక

**ప్రజాపక్షం/పాలకుర్తి:** గూడూరు చేనేత సహకార సంఘం పాలకవర్గం ఎన్నికలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని గ్రామ పంచాయితి కార్యాలయ ఆవరణలో ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో మొత్తం 74 మంది సభ్యులుండగా 69 మంది తమ ఓటు హక్కును వినియోగించారు. మొత్తం 9 మంది డైరక్టర్లుగా విజయం సాధించారు. అనంతరం గూడూరు చేనేత సహకార సంఘం అధ్యక్షునిగా రచ్చ శ్రావణ్, ఉపాధ్యక్షునిగా సామల సదానందం, కార్యదర్శిగా రాములు, కోశాధికారిగా చిదురాల రాములు ఎన్నిక కాగా దీనికి సంబంధించిన దృవపత్రాలను ఎన్నికల అధికారి జె సోమశేఖర్ అందజేశారు. డైరక్టర్లుగా రచ్చ లక్ష్మి , సామల కమలమ్మ, మార్కొండయ్య, రాములు, చిదురాల రాములు, ఉప్పలయ్య, రచ్చ శ్రవణ్, నవీన్, సదానందం ఎన్నికయ్యారు.

## విద్యార్థుల సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వ మొండివైకరి

**ప్రజాపక్షం / నల్లబెల్లి :** విద్యార్థుల సమస్యలపై వామపక్ష విద్యార్థుల సంఘాల రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రంలో శాంతియుతంగా నిరసన చేస్తున్న విద్యార్థులను పోలీసులు ముందస్తు అరెస్టు చేయడం సరైంది కాదని ఎఐఎఫ్‌డిఎస్ రాష్ట్ర కమిటి సభ్యులు మార్త నాగరాజ్ తెలిపారు . శుక్రవారం నల్లబెల్లి మండల కేంద్రంలో ప్రవేటు ,ప్రభుత్వ విద్యాసంస్థలను వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా బందు చేయించారు . ఈ సందర్భంగా మార్త నాగరాజ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలపై పూర్తిగా మొండివైకరి అవలంబిస్తుందని చెప్పారు .

## వైద్యాధికారిణి డాక్టర్ అర్చనకు వీడ్కోలు

**ప్రజాపక్షం/నెక్కొండ:** వైద్య సేవలతో గ్రామీణ ప్రజల మన్ననలు పొందిన అలంకానిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి డాక్టర్ అర్చనకు సహోద్యోగులు, ఆశా కార్యకర్తలు ఘనంగా వీడ్కోలు పలికారు. ఇటీవల బదిలీపై వరంగల్ ఎంజిఎం ఆసుపత్రికి వెళ్ళిన ఆమెకు శుక్రవారం పిహెచ్‌సి ఆవరణలో ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక వైద్యాధికారి డాక్టర్ అఖిల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ అర్చనకు శాలువా కప్పి, పూలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు అంకితభావంతో వైద్య సేవలు అందించిన ఆమె సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ప్రజలతో మ మేకపై సేవలందించే అవకాశం దక్కడం అ దృష్టంగా భావిస్తున్నానని, ప్రతి ప్రభుత్వ ఉ ద్యోగి జీవితంలో బదిలీలు సహజమే అయినప్పటికీ, ఇక్కడి ప్రజల ఆదరణను ఎప్పటికీ మరువలేనని పేర్కొన్నారు. ఆయుష్ వైద్యురాలు డాక్టర్ స్రవంతి, సూపర్‌వైజర్ రమాదేవి, ల్యాబ్ టెక్నీషియన్ రెడ్డి, స్టాఫ్ నర్స్ ది వ్య, సిబ్బంది , ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

## ఎల్లమ్మగుడిలో చీరల పంపిణీ

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** వరంగల్ నగరంలోని 26 డివిజన్ చార్‌బౌలి ఎల్లమ్మ దేవస్థానంలో మాజీ కార్పొరేటర్, చైర్మన్ తత్తరి లక్ష్మ ణ్ అధ్యతన సుమారు 1500 మంది నిరుపేద మహిళలకు అమ్మవారి చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా మాజీ మంత్రి ప్రస్తుత ఎంఎలసి బస్వరాజ్ సారయ్య, రాష్ట్ర బిసి ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎల్లమ్మ దేవస్థాన కమిటీ మిత్ర యూత్ అసోసియేషన్ లక్ష్మి పురం ఎల్‌బి నగర్ ఆధ్వర్యంలో గత 20 సంవత్సరాలుగా అమ్మవారి చీరెలను నిరుపేద మహిళలకు పంపిణీ చేయడం పట్ల కమిటీని అభినందించారు.కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నల్గొండ రమేష్, మాజీ కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్, బస్వరాజ్ శిరీష శ్రీమాన్, వరంగల్ జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ సోమలక్ష్మి , సీనియర్ మహిళా నాయకురాలు,యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కురివి పరమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోరంటల రాజు, ఎన్‌ఎస్‌యూఐ మాజీ అధ్యక్షుడు చాగంటి శ్రీనివాస్, దేవస్థాన కమిటీ నెల్లుట్ల యెల్లయ్య, సలహాదారులు , మహిళలు, కాంగ్రెస్ నాయకులు, పాల్గొన్నారు.

## ఫీజు బకాయిలపై రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం



**ప్రజాపక్షం/మహాదేవపూర్;**విద్యార్థుల ఫీజు బకాయిల విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని కాంగ్రేస్‌పార్టీ టౌన్ అధ్యక్షుడు వార్డు సభ్యుడు నయూమొద్దీన్ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు.గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో 7 వేల కోట్ల బకాయిలు నిలిచిపోయాయని ప్రస్తుత కాంగ్రేస్ ప్రభుత్వం ఫీజు బకాయిలను నేరుగా విద్యార్థుల ఖాతాల్లో దశలవారిగా జమచేయడానికి తీసుకున్న నిర్ణయం అభినందనీయమని,ఎస్‌సి,ఎస్‌టి ,బిసి ,మైనారిటీ దివ్యాంగ విద్యార్థులకు ఫీజులు ఉపయోగపడతాయిన తెలిపారు.గత ప్రభుత్వం విద్యార్థుల చదువులను గాలికొదిలేసిందని కాంగ్రేస్ ప్రభుత్వం 18 నెలల్లోనే విద్యకు ప్రాధాన్యతనిస్తూ బకాయిలు విడుదల చేస్తుందని తెలిపారు.మండలంలోని విద్యార్థులు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని దరఖాస్తులలో సందేహాలు ఉంటే తమను సంప్రదించాలని తెలిపారు.పూద విద్యార్థుల చదువులకు బరోసా కల్పించే విధంగా తీసుకున్న నిర్ణయంతో విద్యార్థులు సకాలంలో తమ వివరాలను ఇఐఇఎఎస్ఎస్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు.

## అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం

### తహసీల్దార్ కార్యాలయం ముందు సిఐటియుఆధ్వర్యంలో ధర్నా

### సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సోమ మల్లారెడ్డి

**ప్రజాపక్షం/గోవిందరావుపేట:**అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియుగోవిందరావుపేట మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించిఅంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐటీయూ యులుగు జిల్లా సహాయ కార్యదర్శి సోమ మల్లారెడ్డి మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు హెల్పర్లకు ప్రతి నెల మొదటి తేదిన వేతనాలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ప్రీ ప్రైమరీ పీఎం శ్రీ కేంద్రాల విలీన నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయడంతో పాటు ఎన్నికల సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 18000వేతనం అమలు చేయాలని పీఎఫ్ సౌకర్యం కల్పించాలని ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు అదేవిధంగా 24 రోజుల సమ్మె కాలానికి సంబంధించిన వేతనాలు పెండింగ్ బకాయిలు పదవీ విరమణ ప్రయోజనాలు ఇంక్రిమెంట్లు టిఎ డిఎబకాయిలను వెంటనే విడుదల చేయాలని అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు మౌలిక సదుపాయాలు కల్పించి ఉద్యోగ భద్రతను ప్రభుత్వం హామీ ఇవ్వాలని అన్నారు అనంతరం అంగన్‌వాడీ ఉద్యోగు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్ఐ మురళికి అందజేశారు ఈ కార్యక్రమంలో యూనియన్ మండల కమిటీ సభ్యులు కే పద్మారాణి ఎస్ భాగ్యమ్మ ధనలక్ష్మి సీహెచ్ అరుంధతా పద్మావతి సరిత తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/గోవిందరావుపేట:**తాడ్వాయి ప్రాజెక్టు గోవిందరావుపేట సెక్టార్ పరిధిలోని దుంపల్లిగూడెం అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం పిఅండ్ జి ప్రథమ్ ఆధ్వర్యంలో పాఠశాల సంసిద్ధత మేళా ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉపసర్పంచ్ బండి రాజశేఖర్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా అంగన్వాడీ సూపర్వైజర్ విజయ మాట్లాడుతూ ప్రవేట్ పాఠశాలలకు దీటుగా అంగన్వాడీ కేంద్రాలు కూడా నాణ్యమైన ప్రీ స్కూల్ విద్యను అందిస్తున్నాయని తెలిపారు అలాగే గర్భిణులు బాలింతలు అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం బాలామృతాన్ని తప్పకుండా వినియోగించుకోవాలని సూచించారు.చిన్నారులు ఆటలు పాటలు కథలు సంభాషణ నైపుణ్యాలు పూర్వ గణిత భావనలను ప్రదర్శించి తల్లిదండ్రులను ఆకట్టుకున్నారు అనంతరం భాషా




మేధో సామాజిక సృజనాత్మక అభివృద్ధిపై కల్పించారు కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు రిపోర్ట్ కార్డులు ఆక్టివిటీ బుక్స్‌ను ఉప సర్పంచ్ బండి రాజశేఖర్ సూపర్వైజర్ విజయ చేతుల మీదుగా అందజేశారు ప్రీ స్కూల్ బోధన సామగ్రి ప్రదర్శన ప్రత్యేక ఆకర్ష ణగా నిలిచింది ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు దీప రుక్మిణి పాఠశాల ఉపాధ్యాయులు చిన్నారులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ తోటలతో అధిక లాభాలు

**ప్రజాపక్షం/కొండపాక :** కుకునూరు పల్లి మండలం తిప్పారం గ్రామంలో ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్ డ్రైవ్ (ఎన్ ఎమ్ఇఓ ఓపి ) కార్యక్రమాన్ని కుక్కునూరు పల్లి మండల అగ్రికల్చర్ అధికారి గోవిందరాజు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తిప్పారం గ్రామానికి చెందిన రైతు సోమలేటి వరలక్ష్మి తన మూడు ఎకరాల వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్ ఫామ్ మొక్కలు నాటారు. రైతులు పంటల విద్యుదీకరణతో పాటు అధిక ఆదాయం పొందేలా, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న జాతీయ తినదగిన నూనెల మిషన్ ఆయిల్ ఫామ్ (ఎన్ఎమ్ఇఓ ఓపి) పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా టిప్పారం గ్రామ సర్పంచ్ భద్రప్ప, మండల వ్యవసాయ అధికారి గోవిందరాజు సూచించారు. ఆయిల్ ఫామ్ సాగు దీర్ఘకాలికంగా అధిక ఆదాయం లభిస్తుంది. ప్రభుత్వం సాంకేతిక సలహాలు, మొక్కలు, వివిధ రకాల ప్రోత్సాహకాలను అందిస్తుందని అర్హులైన రైతులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ శ్రీహరి, ఆయిల్ఫేడ్ ఫీల్ ఆఫీసర్ రాజు, సుధాకర్, డ్రిప్పు అధికారి శ్రీనివాస్ గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## జనజాగరణ యాత్ర వాల్ పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/వాజేడు:** ములుగు జిల్లా వాజేడు మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం భోజన విరామ సమయంలో సిపిఎస్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న జనజాగరణ యాత్ర వాల్ పోస్టర్‌ను మండల విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు ఆనందరావు సంయుక్తంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘం నాయకులు జనజాగరణ యాత్రకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అనంతరం ఇరు సంఘాల నాయకులు మాట్లాడుతూ, సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల మీదుగా చేపట్టిన జనజాగరణ యాత్ర జూలై 28న సాయంత్రం 5 గంటలకు ములుగు జిల్లాకు చేరుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎస్ ఉద్యోగుల సంఘం ములుగు జిల్లా అధ్యక్షుడు అన్నవరం రవికాంత్, రాష్ట్ర కార్యదర్శి గుల్లగట్టు సంజీవ్, ప్రోగ్రెసివ్ గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోకిల శ్రీరంగం, వాజేడు మండల అధ్యక్షుడు పోరిక స్వరూప్ సింగ్‌తో పాటు ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రంలో ఎస్ఐ కూతురు విద్యాభ్యాసం

**ప్రజాపక్షం/భూపాలపల్లి/రేగొండ:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న ఎస్సై సుధాకర్ దంపతుల కూతురు నీ శుక్రవారం మండల కేంద్రంలోని నాలుగవ అంగన్వాడీ కేంద్రంలో తొలి విద్యాభ్యాసాన్ని ప్రారభించారు. అంగన్వాడీ సెంటర్ ను సందర్శించిన ఈ సందర్భంగా ఎస్ఐ సుధాకర్ మాట్లాడుతూ.. చిన్నారుల విద్యకు అంగన్వాడీ కేంద్రాలు తొలి మెట్టు అన్నారు. ఇంత చిన్న వయసులో సెంటర్ కు వచ్చి చదువుకోవడం సంతోషంగా ఉంది అని చిన్నారులు దినదినం విద్యలో ఉన్నత స్థాయిలో ఎదగాలని ఆశీర్వదించారు. అదే గాక తన మానవత్వం చాటుకునేలా అంగన్వాడీ కేంద్రానికి కూర్చులు బహుకరించడం అదేవిదంగా సామాన్యులు పిల్లల తో పాటు మండల కేంద్రం లో ఉన్నత స్థానం లో ఉద్యోగం చేస్తున్న ఎస్ఐసుధాకర్ కూతురును అంగన్వాడీ సెంటర్ కు పంపించడం అనేది చాలా గొప్ప విషయం అని చదువు మొదట అంగన్వాడీ లోనే సెంటర్ లోనే నేర్చుకో వాలని మండల ప్రజలకు తెలియ జేసేలా ఈ మహత్తర కార్యక్రమం అని అంగన్వాడీ టీచర్ నామాల రజిత సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హెల్పేర్ శ్రీలత, మహిళ సంఘం అధ్యక్షురాలు సుమలత, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన వార్డు సభ్యుల ఓరియెంటేషన్ శిక్షణ

**ప్రజాపక్షం/మరిపెడ:**ప్రతి వార్డు సభ్యుడు గ్రామభివృద్ధికి కృషి చేయలనీ,శిక్ష ణలో తెలుసుకున్న అంశలను గ్రామపాలనలో పాటించాలనీ మరిపెడ ఎంపిడిఓ వేణుగోపాల్ రెడ్డి అన్నారు.శుక్రవారం మహబుబాబాద్ జిల్లా మరిపెడ మండలం గిరిపురం రైతు వేదికలో నిర్వాహిస్తూన్న గ్రామపంచాయితి వార్డు సభ్యుల ఓరియేంటేషన్ శిక్ష ణ కార్యక్రమం చివరి రోజు ఆయన హాజరై పంచాయితిరాజ్ చట్టలపై,గ్రామభివృద్ధిపై,పరిపాలన అంశాలపై అవగహాన కల్పించి శిక్ష ణ పూర్తి చేసుకున్నా సభ్యులకు కార్యదర్శులతో కలసి సర్టిఫికేట్లు అందజేశారు.ఈ కార్యక్రమంలో గిరిపురం గ్రామ సర్పంచ్ నీలా సైదులు,ట్రైనర్లు రామోజీ,ప్రణయ్, వెంకన్న, సుమన్,దేవయ్య,కార్యదర్శులు విజిత,రాజోద్దీన్,ఆశోక్, నేహా,సృజన,ఉమేష్,పావని,ఆపరేటర్లు ఉమా,ఉమేష్,సిబ్బాంది రాజా,వార్డు సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

## సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనులు

**ప్రజాపక్షం/గూడూరు;**భూపతిపేట విద్యుత్ సబ్ స్టేషన్‌లో శనివారం (జూలై 11)నిర్వహణ మరమ్మత్తు పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఉదయం కొంత సేపు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గూడూరు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.రెండో శనివారం సందర్భంగా నిర్వహించే ఈపత్యేక మరమ్మత్తు పనుల కారణంగా ఉదయం 8.00గంటలకు నుంచి10.30 గంటలకు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని పేర్కోన్నారు.పనులు పూర్తయిన వెంటనే విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామని తెలిపారు.వినియోగదారులు ఈ విద్యుత్ అంతరాయాన్ని దృష్టిలో ఉంచుకుని అవసరమైన పనులను ముందుగానే పూర్తి చేసుకోవాలని విద్యుత్ శాఖకు సహకరించాలని ఏఈ (ఆపరేషన్) గూడూరు విజ్ఞప్తి చేశారు. నిర్వహణ పనుల ద్వారా విద్యుత్ సరఫరా వ్యవస్థ మరింత మెరుగుపడి వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించేందుకు అవకాశం కలుగుతుందని అధికారులు తెలిపారు.

## ప్రత్యేక సమగ్ర సవరణ 2026పై వీడియో కాన్ఫరెన్స్

**ప్రజాపక్షం/ములుగు:** ప్రత్యేక సమగ్ర సవరణ...2026 కార్యక్రమంలో భాగంగా భారత ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ డాక్టర్ పవన్‌కుమార్ శర్మ, తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి సుదర్శన్ రెడ్డి శుక్రవారం అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ములుగు జిల్లా నుండి ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి సమావేశంలో పాల్గొన్నారు. ఎన్నికల నమోదు ప్రక్రియ, ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని నిబంధనల ప్రకారం సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సూచనలు, మార్గదర్శకాలను అధికారులు వివరించారు. సమావేశంలో ఎన్నికల నమోదు అధికారి(ఆర్‌డిఓ) కృష్ణవేణి, ఎన్నికల సూపరింటిండెంట్ సలీమ్‌తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## టాపర్‌కు లక్ష ప్రోత్సాహకం..

-శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రకటన.
-దూళ్మిట్ట జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థిని రమంయకు అరుదైన గౌరవం.

ప్రజాపక్షం/మద్దూర్/ధూళ్మిట్ట : ఎస్ఎస్‌సి 202526 పరీక్షల్లో జనగామ నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన జడ్పీహెచ్ఎస్ దూళ్మిట్ట విద్యార్థిని తుపాలపురం రమ్యకు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ రూ.1 లక్ష నగదు ప్రోత్సాహకాన్ని ప్రకటించింది.విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ బహుమతిని అందజేయనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.ఈ సందర్భంగా రమ్యను పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనుముల కరుణాకర్ రెడ్డి,ధూళ్మిట్ట సర్పంచ్ లీలా జగన్మోహన్ రెడ్డి,ఎపిపిసి చైర్మెన్ నాచగోని లక్ష్మీ,ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## మండలంలో విద్యా సంస్థల బంద్ ప్రశాంతం..

-ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి..
-విద్యార్థి సంఘాల నాయకులు

ప్రజాపక్షం/బెజ్జంకి : ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాని ప్రైవేట్ ఫీజుల నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు పరచాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సమస్యల పరిష్కారం కోసం వామపక్ష విద్యార్థి సంఘాల రాష్ట్ర సమితి పిలుపు మేరకు మండలంలోని విద్యార్థి సంఘాల నాయకులు శుక్రవారం బంద్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సంగెం మధు, నాయకులు బొమ్మిడి సాయి కృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాని ప్రైవేట్‌ఫీజుల నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు పరచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని రాష్ట్రంలో 27 వేల ప్రభుత్వ పాఠశాలల్లో 4 వేలకు పైగా పాఠశాలలను మూసివేయాలని కుట్ర చేస్తుందని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలనా లేని యెడల విద్యార్థులతో కలిసి ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని హెచ్చరించారు.

## ప్రశాంతంగా దుద్దెడ చేనేత సహకార సంఘం ఎన్నికలు

ప్రజాపక్షం/ కొండపాక : కొండపాక మండలం దుద్దెడ గ్రామంలో చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి, విక్రయ సంఘం పాలకమండలి ఎన్నికలు గురువారం అట్టహాసంగా సాగాయి. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎన్నికలు కొనసాగాయి. మధ్యాహ్నం ఓట్ల లెక్కింపు జరిగింది. ఓట్ల లెక్కింపు అనంతరం 9 మంది డైరెక్టర్లకు గాను ఏడుగురు పురుషులు, ఇద్దరు మహిళలు డైరెక్టర్లుగా ఓటింగ్ ద్వారా ఎన్నుకోబడినట్లు ఎన్నికల అధికారి సతీష్ రెడ్డి తెలిపారు. ఎన్నికల అనంతరం చైర్మన్, పాలకమండలి ఎన్నికను ఆదివారంకు వాయిదా వేసినట్లు తెలిపారు. ఈ ఓరాహోరీగా సాగిన ఎన్నికల్లో దుద్దెడ గ్రామానికి చెందిన వడ్లకొండ శ్రీనివాస్, బొజ్జ నరేందర్, వైద్యుల లక్ష్మీ నారాయణ, బొజ్జ లలిత, సిరిసినగండ్ల గ్రామానికి చెందిన గంగుల గణేష్, రాజగిరి వీరేశం, కొండపాక కు చెందిన పులగం కిష్టయ్య, మర్పడగా గ్రామానికి చెందిన లగిశెట్టి అంజనేయులు, గడ్డమీది సత్తవ్వ లను ఎన్నికలలో మెజార్టీ ఓట్లను కైవసం చేసుకుని డైరెక్టర్లుగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. మొత్తం 9 గ్రామాలకు 147 ఓట్లకు గాను 133 మంది సభ్యులు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

# శాంతి భద్రతల పరిరక్షణలో నిర్లక్ష్యం చేయొద్దు



ప్రజాపక్షం / గజ్వేల్ : గౌరారం పోలీస్ స్టేషన్ ను అడిషనల్ డీసీపీ కుశాల్కర్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, విధుల నిర్వహణ, సిబ్బంది పనితీరును ఆయన పరిశీలించారు. అనంతరం స్టేషన్ సిబ్బందితో సమావేశమై, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించోద్దని, క్రమశిక్షణ పాటించాలని, ప్రజలతో మమేకమై మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని, కేసుల దర్యాప్తులో నాణ్యతను మరింత మెరుగుపరచాలని తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే క్రైమ్, క్రిమినల్ ట్రాకింగ్ నెట్వర్క్ వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించడం వంటి అంశాలపై సూచనలు చేశారు. ముఖ్యంగా దొంగతనాలు, ఇతర నేరాల నివారణకు రాత్రి గస్తీని మరింత పటిష్టం చేయాలని, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. ప్రజల సహకారంతో నేరాల నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని సూచించారు. గౌరారం పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజీవ్ రహదారి హైవేపై ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించి అవి నిరంతరం పనిచేసేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీలో గజ్వేల్ రూరల్ సిఐ రవిరాజు, గౌరారం ఎస్ఐ ఆరోగ్యం పాల్గొన్నారు.

# మై భారత్ వాలంటీర్ల నమోదుకు ధరఖాస్తుల ఆహ్వానం

- జులై 20 వరకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలి
- ఉమ్మడి మెదక్ జిల్లా యువజన అధికారి ఎం.రంజిత్‌రెడ్డి

ప్రజాపక్షం /సంగారెడ్డి : కేంద్ర యువజన వ్యవహారాలు ,క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న మై భారత్ కార్యక్రమం కింద సంగారెడ్డి జిల్లాలో వాలంటీర్ల నమోదుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి మెదక్ జిల్లా యువజన అధికారిఎం. రంజిత్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన యువత ఈ నెల 20వ తేదీ లోగా ఆన్‌లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం యువతను దేశ నిర్మాణంలో భాగస్వాములను చేయాలనే లక్ష్యంతో అమలు చేస్తున్నమై భారత్ కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి జిల్లాలో వాలంటీర్లను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఎంపికైన వాలంటీర్లు ఆరోగ్యం, అక్షరాస్యత, పారిశుద్ధ్యం, లింగ సమానత్వం, పర్యావరణ పరిరక్షణ తదితర సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల ప్రచారంలో భాగస్వాములు కావాల్సి ఉంటుందని తెలిపారు. అలాగే అత్యవసర పరిస్థితులు, విపత్తులు, వివిధ కార్యక్రమాల అమలులో స్థానిక పరిపాలనకు సహకరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు కనీసం పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి, 0104 2025 నాటికి 18 నుండి 29 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలని తెలిపారు. ఎంపికైన వాలంటీర్లకు రెండు సంవత్సరాల కాలానికి నెలకు రూ. 5,000 ఆల్ ఇన్ క్లూసివ్ గౌరవ వేతనం చెల్లించబడుతుందని వెల్లడించారు ప్రస్తుతం రెగ్యులర్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు కాదని స్పష్టం చేశారు. ఆసక్తి గల అభ్యర్థులు https\\mybharat.gov.in paqesmy corp, qit ద్వారా ఆన్‌లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ చివరి తేదీ జులై 20,2026 అని తెలిపారు. ఇది ఉద్యోగ నియామకం కాదని ఎలాంటి పెయిడ్ ఉద్యోగం ,కాంట్రాక్టు ఉద్యోగం కూడా కాదని స్పష్టం చేశారు. ఈ వాలంటీర్ సేవల ద్వారా ప్రభుత్వం ,మై భారత్ సంస్థలో శాశ్వత ఉద్యోగం పొందేదుకు ఏలాంటి చట్టపరమైన హక్కు కల్పించబడదని పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లాలో వాలంటీర్ల ఎంపిక కోసం 12 బ్లాక్ లను అమీన్ పూర్, జిన్నారం, వట్పల్లి, హత్నూర, గుమ్మడిదల ఝురాసంఘం ,రాయికోడ్, కల్హేర్, సిర్గాపూర్, కంది, కొండాపూర్, మనూరు, నాగలిగిద్ద, నారాయణఖేడ్, కంగ్టి, పటాన్ చెరు, రామచంద్రాపురం, సదాశివపేట , మునిపల్లి, సంగారెడ్డి, పుల్కల్, జహీరాబాద్, కోహీర్ లను గుర్తించినట్లు ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు సిద్దిపేట కోలిలింగాల ఆలయం సమీపంలో గల జిల్లా యువజన అధికారి కార్యాలయంలో నేరుగా ఫోన్ నంబర్ 9650889829లో సంప్రదించాలని సూచించారు.

# ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు విజ్ఞాన యాత్ర



ప్రజాపక్షం /సంగారెడ్డి : ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగుపై ఆసక్తి ఉన్న రైతులకు విజ్ఞాన యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన 22 మంది రైతులను ఖమ్మం జిల్లా కొనిజర్ల మండలంలోని ఆయిల్ పామ్ తోటల సందర్శనకు గోద్రెజ్ ఆగ్రోవేట్ సంస్థ సహకారంతో తీసుకు వెళ్లారు . ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జాతీయ ఆయిల్ పామ్ మిషన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు ఆయిల్ ఫామ్ సాగుపై క్షేత్ర స్థాయి అవగాహన కల్పించడం శాస్త్రీయ సాగు పద్ధతులను పరిచయం చేయడం ,ఇతర ప్రాంతాల్లో విజయవంతంగా సాగు చేస్తున్న రైతుల అనుభవాలను తెలుసుకునే అవకాశాన్ని కల్పించడం ఈ విజ్ఞాన యాత్ర ముఖ్య ఉద్దేశ్యం ఈసందర్భంగా రైతులు ఆయిల్ పామ్ తోటలను ప్రత్యేక్షంగా సందర్శించి మొక్కల పెంపకం తోటల నిర్వహణ ఎరువుల యాజమాన్యం ,నీటి నిర్వహణ పంట సంరక్షణ దిగుబడులు ,తాజా పండ్ల గుత్తుల కోత ,రవాణా ప్రాసెసింగ్ ,మార్కెటింగ్ అంశాలపై క్షేత్ర స్థాయిలో అవగాహన పొందారు. అదే విధంగా ఆయిల్ ఫామ్ సాగు చేస్తున్న రైతులతో ముఖాముఖిగా సమావేశమై వారు అనుసరిస్తున్నసాగు పద్ధతులు ,నిర్వహణ విధానాలు ,పంట ద్వారా పొందుతున్న ఆదాయం ,ఎదురైన సమస్యలు ,వాటి పరిసరాల గురించి తెలుసుకున్నారు. ఈ పరస్పర చర్చలు రైతుల్లో ఆయిల్ పామ్ సాగుపై మరింత నమ్మకాన్ని పెంపొందించాయి . విజ్ఞాన యాత్రను ఉద్యాన అధికారి కె. మౌనికా రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయిల్‌ఫామ్ దీర్ఘకాలికంగా స్థిరమై ఆదాయాన్ని అందించే వాణిజ్య పంట అని ప్రభుత్వం ఎన్.ఎం.ఈ.ఓ ఓపి పథకం ద్వారా అందిస్తున్న పోత్రకాలు ,సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకుని ఆయిల్ పామ్ సాగును విస్తరించాలని సూచించారు. అలాగే శాస్త్రీయ పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించి మంచి ఆదాయాన్ని పొందవచ్చని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి కె. మౌనికారెడ్డి ,గోద్రెజ్ ఆగ్రోవేట్ సంస్థ ఏజీఎం ఈశ్వర్‌రెడ్డి సంస్థ ప్రతినిధులు, సంగారెడ్డి జిల్లాలలోని వివిధ మండలాలకు చెందిన ఆయిల్ పామ్ సాగుపై ఆసక్తి గల రైతులు పాల్గొన్నారు.

## చేనేత సహకార సంఘం డైరెక్టర్ గా సిపిఐ నేత స్వర్గం రాజేశం

ప్రజాపక్షం / గజ్వేల్ : గజ్వేల్ చేనేత సహకార సంఘం డైరెక్టర్ గా సిపిఐ నేత స్వర్గం రాజేశం ఎన్నికయ్యారు. అలాగే గాడిపల్లి శ్రీనివాస్, గాడిపల్లి విజయ్, వల్లందాసు సత్యనారాయణ, ఎలగందుల రామచంద్రం, దొంతుల ప్రసాద్, చెప్యాల మల్లేశం, జిల్లా భాగ్యలక్ష్మి, బొల్లిబొత్తు లఅమృతమ్మ లు డైరెక్టర్లుగా ఎన్నిక కాగా, ఎన్నికల అధికారి వారికి గెలుపు ధృవీకరణ పత్రాలు అందజేశారు. కాగా 11వ తేదీన సంఘ కార్యాలయంలో అధ్యక్ష, కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఈ ఎన్నికలు అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగగా, పార్టీల నేతలు ప్రత్యక్షంగా, పరోక్షంగా అభ్యర్థులకు సహకారం అందించారు.

## వర్షభావ పరిస్థితులున్నందున ప్రత్యామ్నయ పంటలపై దృష్టిపెట్టాలి:ఏఓ బి.వీరాసింగ్

ప్రజాపక్షం/మరిపెడ: వర్షభావ పరిస్థితులున్నందున రైతులు తక్కువ నీటితో సాగు అయ్యే పెసర్లు, కందులు, మినుములు, ఆయిల్ పామ్, బొబ్బర్లు, జొన్నలు తదితర పంటల పైన దృష్టి పెట్టలనీ మరిపెడ ఎఓ బి.వీరాసింగ్ అన్నారు. శుక్రవారం మరిపెడ మండలం బాల్నిదర్మారం గ్రామంలో వర్షభావ పరిస్థితుల నేపద్యంలో రైతులకు ప్రత్యామ్నయ పంటల సాగు, పంట మర్పిడి పై నిర్వాహించిన అవగాహన సదస్సు ఆయన హాజరై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అయన మట్లడుతూ ప్రస్తుత పరిస్థితులలో రైతులు తక్కువ నీటితో సాగు అయ్యె పంటలను ఎంపిక చేసుకోవాలనీ, శాస్త్రీయ పద్ధతులు అనుసరించాలనీ సూచించారు. అలాగే పంట మర్పిడి ద్వారా భూసారాన్నీ కపాడుకోవాడంతో పాటు దిగుబడులు,అదాయం పెరుగుతాయని వివరించారు. అనంతరం ఎఇఇఎస్ శ్రీకాంత్, ఇరిగేషన్ అదికారులు రైతులకు ప్రభుత్వ సూచనలు, సేవలు, వర్షభావ పరిస్థితుల్లో తీసుకోవలసిన జాగ్రత్తలు, సమగ్ర పంట నిర్వాహణ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అదికారి స్రవంతి, గ్రామ సర్పంచ్ బండ జ్యోతి మదు, రైతులు, ప్రజాప్రతినిదులు పాల్గొన్నారు.

## 13న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం

ప్రజాపక్షం/ములుగు: జిల్లాలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా శిశు ఆరోగ్యం, వ్యాధి నిరోధక టీకాల నియంత్రణాధికారి డాక్టర్ నాగ అన్వేష్ కోరారు. శుక్రవారం జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో నిర్వహించిన ఏర్పాట్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూలై 13న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని, జులై 20న మాప్.అప్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో 1 నుండి 19 సంవత్సరాల వయస్సు గల 73,444 మంది పిల్లలకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఇందుకోసం 611 అంగన్‌వాడీ కేంద్రాలు, 514 ప్రభుత్వ, ప్రయివేట్ ప్రాథమిక, ఉన్నత ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. వైద్యారోగ్యశాఖ సిబ్బంది ఆయా విద్యాసంస్థలకు వెళ్ళి పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు అందించడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత, చేతులు శుభ్రంగా కడుక్కోవడం వంటి అంశాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. నేల కాలుష్యం ద్వారా వ్యాపించే నులిపురుగులు పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని, శారీరక, మానసిక ఎదుగుదల దెబ్బతినడంతో పాటు రక్తహీనత, ఏకాగ్రత లోపం వంటి సమస్యలు తలెత్తుతాయని వివరించారు. స్త్రీ, శిశు సంక్షేమశాఖ, విద్యాశాఖ, గిరిజన సంక్షేమశాఖ, ఎస్‌సి, ఎస్‌టి, బిసి సంక్షేమశాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మాస్ మీడియా అధికారి సంపత్, డిపిఎంఓ సాంబయ్య, వెంకటేశ్వర్లు, సురేష్ బాబు, కిరణ్, అనిల్, అఖిల్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభ చాటిన రమేష్‌ను అభినందించిన : ఏసిపి నర్సింలు

ప్రజాపక్షం/గజ్వేల్ : హైదరాబాదులోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జేఆర్ ఆత్మ రక్షణ పోటీల్లో గజ్వేల్ మండల పరిధిలోని కంసాని రమేష్ అత్యంత ప్రతిభ కనబరిచి ప్రశంస పత్రం, మెడల్ అందుకున్నారు. ఈ సందర్భంగా గజ్వేల్ ఏసిపి నర్సింలు మాట్లాడుతూ, రమేష్ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. డ్రగ్స్, మద్యం తదితర వాటికి వ్యతిరేకంగా విద్యార్థులు, యువతను చైతన్యం చేయాలని కోరారు.

## టాపర్‌కు లక్ష ప్రోత్సాహకం

**ప్రజాపక్షం/మద్దూర్/ధూల్మిట్ట:** ఎస్ఎస్‌సి 2025–26 పరీక్షల్లో జనగామ నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన జడ్పీహెచ్ఎస్ దూల్మిట్ట విద్యార్థిని తుషాలపురం రమ్యకు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ రూ.1 లక్ష నగదు ప్రోత్సహకాన్ని ప్రకటించింది.విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ బహుమతిని అందజేయనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.ఈ సందర్భంగా రమ్యను పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనుముల కరుణాకర్ రెడ్డి, ధూల్మిట్ట సర్పంచ్ లీలా జగన్మోహన్ రెడ్డి,ఎ ఎపిసి చైర్మన్ నాచగోని లక్ష్మీ ,ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## బెజ్జంకిలో విద్యా సంస్థల బంద్

**ప్రజాపక్షం/బెజ్జంకి:** ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాని ప్రైవేట్ ఫీజుల నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు పరచాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సమస్యల పరిష్కారం కోసం వామపక్ష విద్యార్థి సంఘాల రాష్ట్ర సమితి పిలుపు మేరకు మండలంలోని విద్యార్థి సంఘాల నాయకులు శుక్రవారం బంద్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంగెం మధు,ఎస్ఎఫ్ఐ నాయకుడు బొమ్మిడి సాయి కృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాని ప్రైవేట్ ఫీజుల నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు పరచాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని రాష్ట్రంలో 27 వేల ప్రభుత్వ పాఠశాలల్లో 4 వేలకు పైగా పాఠశాలను మూసివేయాలని కుట్ర చేస్తుందని అన్నారు.ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలనా లేని యెడల విద్యార్థులతో కలిసి ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని హెచ్చరించారు.

## ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో యూరియా

**ప్రజాపక్షం/అల్లాదుర్గం:** మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో యూరియా అందుబాటులో ఉందని చైర్మన్ దుర్గా రెడ్డి శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ, మండలంలోని రైతులు యూరియా యాప్ లో బుక్ చేసుకొని ఆధార్ కార్డు జిరాక్స్ పట్టా పాస్ బుక్ జిరాక్స్ తీసుకొని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో యూరియా తీసుకోవచ్చు అన్నారు. ఈ అవకాశాన్ని రైతులందరూ వినియోగించుకోవాలని తెలిపారు.

## రాత్రి 8 దాటితే ప్రయాణం ఆపాల్సిందే

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** మండలం జిల్లా దాటి ఇతర దూర ప్రాంతాలకు వెళ్లిన ప్రయాణికులకు గమ్యస్థానాలకు చేరుకోవాలంటే బస్సు సౌకార్యలు లేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. నిజాంపేట మండల వ్యాప్తంగా ప్రజలు వివిధ పనుల నిమిత్తం ఆయా ప్రాంతాలకు వెళ్తూ.. ఉంటారు. మెదక్ సిద్దిపేట జాతీయ రహదారిని అనుకున్ని ఉన్న అభివృద్ధి శూన్యం.. ఈ ప్రాంతం నుండి ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్తే.. తిరిగి రాత్రి 8 దాటిందంటే బస్సు సౌకర్యం లేక ప్రయాణం నిలుపుకోవాల్సి వస్తుందని వాపోతున్నారు. ఆ రాత్రి అక్కడే షెల్టర్ చూసుకోవాలి. ప్రజల సౌకర్యార్థం చివరి బస్సు రాత్రి 9 గంటలకు ఉంటే బాగుంటుందని, సిద్దిపేట జిల్లా కేంద్రం నుంచి మెదక్ జిల్లా కేంద్రం నుంచి రాత్రి 9 గంటలకు బస్సు ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలని వేడుకుంటున్నారు.

# పరిసరాల పరిశుభ్రతతోనే రోగాలకు చెక్

**ప్రజాపక్షం/రామాయంపేట:** పరిసరాల పరిశుభ్రతతోనే రోగాలను నియంత్రించవచ్చని మున్సిపల్ చైర్మెన్ గజవాడ లావణ్య నాగరాజు అన్నారు. శుక్రవారం మున్సిపాలిటి పరిదిలోని 7వ వార్డులో స్థానిక వైద్య సిబ్బంది, మున్సిపల్ సిబ్బందితో కలిసి సీజనల్ వ్యాదులపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాదులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. గతంలో గొలిపర్తి గ్రామంలో డెంగ్యూ, మలేరియా వ్యాదుల బారిన పడిన విషయాన్ని గుర్తు చేసి జాగ్రత్తలు పాటించాలని కోరారు. ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు చుట్టు పక్కల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇళ్లల్లో పాత కుండీలు, పాత టైర్లల్లో నీరు చేరకుండా చూసుకోవాలన్నారు. వీదుల్లో గుంతలు పడి నీరు నిలిచినట్లయితే మున్సిపాలిటికి సమాచారం అందించాలన్నారు. ప్రజల ఆరోగ్య రక్షణే ద్యేయంగా మున్సిపల్ యంత్రాంగం పనిచేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో స్థానిక వైద్యురాలు వాసవి, కౌన్సిలర్లు గజవాడ నాగరాజు, గుగులోతు రవినాయక్, పుట్టి సందీప్, దేవుని రంజిత్, డిసిసి కార్యదర్శి పోచమ్మల గణేష్, నాయకులు దాకి స్వామి, బొర్ర అనిల్, చింతల స్వామి, తొంటవాలి యాదగిరి, నరేష్‌తో పాటు తదితరులు ఉన్నారు.

# ఓటు హక్కు కోల్పోకుండా అప్రమత్తత



**ప్రజాపక్షం/వాజేడు:** ములుగు జిల్లా వాజేడు మండలంలోని మారుమూల ఏజెన్సీ ప్రాంతమైన మొరుమూరు గ్రామ పంచాయతీ పరిధిలోని కొప్పుసూరు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక ఓటరు జాబితా సర్ సర్వేలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీకి చెందిన ఏ ఒక్క ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా బూత్ లెవల్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండి సర్వే ప్రక్రియను పర్యవేక్షించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరుకు ఓటు హక్కు కల్పించేలా అధికారులు పారదర్శకంగా, నిబంధనల ప్రకారం సర్వే నిర్వహించాలని కోరారు.ఓటరు జాబితాలో పేర్లు సక్రమంగా నమోదయ్యేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని, ప్రజలు కూడా సర్వే అధికారులకు అవసరమైన వివరాలు అందించి తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మొరుమూరు గ్రామ సర్పంచ్ మడకం సుభద్ర, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్.కే. ఖాజావలి, రోడ్డ దారేలు, గారాపు వెంకటేశ్వర్లు, లక్ష్మణ్, చిచ్చడి వెంకటేశ్వర్లు, సాధనపల్లి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

# శంకు స్థాపనతో దేవస్థానం అభివృద్ధి పనులు ప్రారంభం

### బహిరంగ టెండర్ల ద్వారా సేవలు ఆలయానికి డెలివరీ



**ప్రజాపక్షం /పటాన్‌చెరు:** రుద్రారం శ్రీ గణేష్ దేవస్థానం మూలంగా రుద్రారం గ్రామంలో మొట్టమొదటగా దేవస్థానం ఎక్స్పెండిచర్ సీల్డ్ బహిరంగ టెండర్లు నిర్వహించి అవేన్నిటిని స్థానికులు దక్కించుకున్నారు. ఆలయ అభివృద్ధి భక్త సేవల నిర్వహణ కోసం టెండర్ల ద్వారా వివిధ సరఫరా దారులను ఎంపిక చేయడం శంఖుస్థాపన కార్యక్రమంలో 32 గణపతుల నిర్మాణానికి పునాది వేయడాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రధానాంశాలు దేవస్థానం ఎక్స్పెండీచర స్టీల్ బహిరంగ టెండర్లు మొదట సారి జరిపి వివిధ సేవలకు స్థానికులే ఎంపికయ్యారు. అన్న సంతాపన ,వంట సరఫరాకు, బి.శివరాములు, (రుద్రారం ) ఎంపిక అయ్యారు కూరగాయ సరఫరాకు ఎస్ లక్ష్మ ణరావు (సంగారెడ్డి ) చలువ పందిర్లు ఏర్పాటు ఎం సాయ ప్రసాద్ (కోహీర్) ఎన్నికయ్యారు. టెంట్ సామాగ్రి కోసం గాజుల బాస్కర్ (కోహీర్) సిబ్బంది ఔట్సోరింగ్ కు సువర్ణ ,సెక్యూరిటీ సర్వీస్ (రుద్రారం) ఎంపికయ్యారు. నిత్యపూజ పూలు ,పూలదండలు, అందజేయడానికి టీ శ్రీనివాస్ ( సంగారెడ్డి) కేటాయించారు. ఆలయ అభివృద్ధి కార్యాచరణలో భాగంగా ప్రదక్షిణ మండపంలో 32 గణపతుల నిర్మాణం కోసం శంకుస్థాపన కార్యక్రమం జరిగిందని ఆలయ కమిటీ ప్రకటించింది. దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ రంగరావు దేవాధాయ శాఖ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ శ్రీనివాస శర్మ, ఆలయ ఇఒ ఎస్ లావణ్య ,దేవస్థానం చైర్మేన్ అల్లం రెడ్డి, పాలక మండలి సభ్యులు హరిప్రసాద్, రెడ్డి, పినర్సింలు, కె. కృష్ణవేణి, బి. మంజుల ,ఏ నాగరాజ్,గౌడ్, జి సంతోష్ శర్మ, పీవీ నరసింహులు ,బి. జ్ఞానేశ్వర్, ప నారాయణ .పిఆదిత్య రెడ్డి ,పి రుక్మారెడ్డి, ఎస్ నరసింహరెడ్డి. పిమదుసూదన్‌రెడ్డి, ఏ నరసింహ గౌడ్ తదితరులతో పాటు గ్రామ పెద్దలు ,భక్తులు ,ఆలయ అర్చక సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

# వోక్సెన్ యూనివర్సిటీలో తొలి బ్యాచ్ ముంగింపు

### ఎస్‌పి పరితోష్ ఫంకజ్

**ప్రజాపక్షం /సంగారెడ్డి :** జిల్లా పోలీసు సిబ్బందితో వృత్తి రీత్యా నైపుణ్యాలను పెంపొందించేందుకు వోక్సెన్ యూనివర్సిటీ నిర్వహిస్తున్న ఎంఎస్ ఆఫీస్ ప్రత్యేక శిక్షణ కార్యక్రమం తొలి బ్యాచ్ మూడో రోజు ముగింపు కార్యక్రమానికి సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ ఫంకజ్ ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ పూర్తిచేసుకున్న పోలీసు సిబ్బందికి పార్టీసిపేషన్ సర్టిపికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో పోలీసు శాఖలో సాంకేతిక పరిజ్ఞానం ,వినియోగం విస్తృతమవుతున్న నేపథ్యంలో సిబ్బంది ఆధునిక సాఫ్ట్ వేర్లపై పట్టు సాదించడం అత్యంత అవసరమని తెలిపారు. ఎంఎస్ ఆఫీస్ ముఖ్యంగా వర్డ్, ఎక్సెల్, వంటి సాఫ్ట్ వేర్లలో ప్రావీణ్యం పెరగడం ద్వారా కార్యాలయ పనితీరులో వేగం ఖచ్చితత్వం , సమర్థత మరింత మెరుగుపడుతుందని ఎస్పీ పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయం సిబ్బంది స్టేషన్ రైటర్లు, ,సైబర్ వారియర్స్ టెక్ టీమ్, సిబ్బందికి వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు మొత్తం 180 మంది సిబ్బందిని 3 బ్యాచ్‌లు విభజించి ప్రతి బ్యాచ్‌కు 3 రోజుల చొప్పున శిక్షణను అందించడం జరుగుతుందని అన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను రోజువారీ విధుల్లో సమర్థవంతంగా వినియోగించుకోవాలని ప్రతి ఒక్కరూ సాంకేతిక పరిజ్ఞానాన్ని తమ పనితీరును మెరుగుపరుచుకునేదుకు ఒక సాధనంగా ఉపయోగించుకోవాలని సూచించారు. పోలీసు శాఖలో సేవల నాణ్యతను పెంచడంలో ఇటువంటి నైపుణ్యాబివృద్ధి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న తొలి బ్యాచ్ సిబ్బందికి జిల్లా ఎస్పీ పార్టీసిపేషన్ సర్టిపికెట్లు అందజేసి అభినందించారు. వోక్సెన్ యూనియవర్సిటీ యాజమాన్యం ప్రోఫెసర్లకు పోలీసు శాఖ తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వోక్సెన్ యూనివర్సిటీ ప్రోపెసర్స్ ,జిల్లా పోలీసు అధికారులు శిక్షణ పొందిన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పైవేట్‌కి ధీటుగా ప్రభుత్వ పాఠశాల

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** ప్రైవేట్ పాఠశాలలు కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యా కొనసాగుతుందని, మండల విద్యాధికారి శ్రీనివాస్, సర్పంచ్ ప్రవీణ్, ప్రధానోపాధ్యాయులు పరశురాములు అన్నారు. నిజాంపేట మండలం రాంపూర్ లో శుక్రవారం ప్రీప్రైమరీ తరగతులు ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు పౌష్టిక ఆహారం లభిస్తుందని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాఠశాల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చెయ్యాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ ఎం జ్ఞానమాల, పాఠశాల హెచ్ ఎం పద్మా రెడ్డి, ఎ ఎ పి సి చైర్మన్ యాదమ్మ, వార్డు మెంబర్ సతీష్, సయ్యద్, ఉపాధ్యాయులు గీతా, సృజన తదితరులు పాల్గొన్నారు.

## మహిళ సమాఖ్య భవనానికి శంకుస్థాపన

**ప్రజాపక్షం/శివ్వంపేట :** శివ్వంపేట మండలం పెద్దగొట్టిముక్ల గ్రామంలో ఎన్ఆర్ఇజిఎస్ కింద మంజూరు అయిన రూ. 10లక్షల నిధులతో మహిళా సమాఖ్య భవనానికి సర్పంచ్ మోకాళ్ల నవీన్ చేతులమీదుగా శంకుస్థాపనచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, మహిళా సంఘాలకు సమాఖ్య భవనం ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆంజనేయులు, వార్డు సభ్యులు బేరి సాయికుమార్, హరీశ్, అల్లాడి వీరేశం, లాలోళ్ల నవీన్, గుండ లక్ష్మ ణ్, మురళీమనోహర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మహేశ్‌గౌడ్, వాకిటి వీరారెడ్డి, మంగలి ఆంజనేయులు, ప్రభాకర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

## గ్రంథాలయ భవనం ప్రారంభోత్సవానికి సిద్ధం

**ప్రజాపక్షం/రేగోడ్:** దశాబ్దాల కాలం నుండి అద్దె రూమ్ లో కొనసాగుతున్న గ్రంథాలయానికి సోంత భవనం సిద్దమైంది 50 లక్షలతో నిర్మి ంచిన గ్రంథాలయా భవనం ప్రారంభోత్సవానికి సిద్దంగా ఉంది మండల కేంద్రం రేగోడ్ లో గ్రంథాలయం అద్దె భవనంలోని కొనసాగుతుంది దశాబ్దాల కాలంగా సోంత భవానానికి నోచుకోలేదు ఎట్టకేలకు గ్రంథాలయం భవన నిర్మణానికి నిధులు మంజూరు జరిగాయి రూ 50 లక్షలతో మోడల్ భవనం నిర్మాణం చేపట్టారు రేగోడ్ గ్రామ కంఠం లో నిర్మించిన గ్రంథాలయం భవనం పెయింట్ బోర్డు ఏర్పాటు చేశారు భవనం ప్రారంభోత్సవానిరి సిద్దంగా ఉందని ఆ శాఖ ఏఈ యాదగి తెలిపారు

## ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం / గజ్వేల్:** శాసన మండలి సభ్యులు డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి జన్మదిన వేడుకలు గజ్వేల్ లో శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు, అభిమానులు ఆయనను ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ చందన రవీందర్, మాజీ చైర్మన్ రాజమౌళి గుప్త, వైస్ చైర్మన్ పద్మబాయి నరసింగరావు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు సంతోష్ గుప్తలతో పాటు కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు ఆయనను శాలువాతో సత్కరించి కేక్ కట్ చేసి తినిపించారు. అలాగే ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి ఎర్రవల్లి ఫాంహౌజ్ లో బిఆర్ఎస్ పార్టీ అధినేత కెసిఆర్ దంపతులను ఆయన సతీసమేతంగా కలిసి ఆశీస్సులు పొందగా, ఈ సందర్భంగా కెసిఆర్ యాదవ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పిలుపు

**ప్రజాపక్షం/వాజేడు:** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ శుక్రవారం వాజేడు మండల కేంద్రంలో మొక్కల నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. వాజేడు సర్పంచ్ బోధబోయిన స్వరూప, వైద్యాధికారి డాక్టర్ యోషిత కలిసి మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టాలంటే ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి, అది పెద్ద చెట్టుగా ఎదిగే వరకు సంరక్షించాలని సూచించారు. మొక్కలు పర్యావరణ సమతుల్యతను కాపాడటమే కాకుండా, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందిస్తాయని తెలిపారు.వాజేడు ఎంపిడిఒ కృపాకర్, నూగూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పూనెం రాంబాబు, నాగారం గ్రామ కార్యదర్శి చాట్ల ప్రభాకర్, వైద్య సిబ్బంది లకన్, నవీన్, సమ్మయ్య, గ్రామ పంచాయతీ సిబ్బంది మల్లయ్య పాల్గొన్నారు.